









● కాలుతున్నాయ్..!

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు మండుటెండలో ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌రోడ్డుపై భక్తుల రాకపోకలకు చలువ పందిరి వేసినప్పటికీ.. కొన్ని ప్రాంతాల్లో భక్తులు ఎండలో నడవలేకపోతున్నారు. కాళ్లకు చెప్పులు కూడా లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఓం టర్నింగ్ నుంచి ఆలయం వరకు వైట్ పెయింట్ వేయించినా ఫలితం లేకపోవడంతో కాలు కాలకుండా పట్టాలు ఏర్పాటుచేసి వాటిపై నీరు చల్లాలని భక్తులు కోరుతున్నారు.

● ఇఫ్తార్ విందులో సీఎం



విజయవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో గురువారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఆయనకు ముస్లిం మతపెద్దలు స్వాగతం పలికారు. పవిత్ర గ్రంథం ఖురాన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి చంద్రబాబు ఇఫ్తార్ విందు అందుకున్నారు. వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



అన్నదాన విభాగంలో అవినీతి భోజనం

దుర్గగుడి అన్నదాన విభాగంలో ఉద్యోగుల చేతివాటం

మూడు నెలల సిబ్బంది బిల్లులు రూ.20 లక్షలట..!



కూరగాయలు తరుగుతున్న సేవాబృందం సభ్యులు

- ఆలయ సిబ్బందితో పాటు ఉచిత సేవా సభ్యుల పేర్లు కూడా..
- కమీషన్లు, మామూళ్ల డబ్బుతో సిబ్బందికి వేతనాలు
- బిల్లులు వచ్చాక పంపకాలకు ఉద్యోగుల ప్రయత్నాలు
- ఈవో తనిఖీల్లో బయటపడిన నిజాలు

ఇంద్రకీలాద్రి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు పెద్ద ఎత్తున బిల్లులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విభాగంలో పనిచేసే సిబ్బందికి మూడు నెలల్లో సుమారు రూ.20 లక్షల బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. ఈ పెండింగ్ బిల్లులపై దేవస్థాన ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ప్రత్యేక దృష్టిసారించి తనిఖీ చేయగా, అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

అవినీతి బయటపడిందిలా..

అన్నదాన విభాగ సిబ్బంది కాంట్రాక్ట్ గడువు గత ఏడాది నవంబరు 15న ముగిసింది. ఆ కాంట్రాక్టర్ 30 మంది సిబ్బందిని మిగతా 4లో..

బిల్లులు వచ్చాక పంపకాలు

అన్నదాన విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి ఆ విభాగంలో పనిచేసే పలువురు ఉద్యోగులు తమకు వచ్చే కమీషన్లు, మామూళ్ల డబ్బుతో జీతాలు చెల్లించినట్లు దేవస్థానం అధికారులే చెబుతున్నారు. బకాయి బిల్లులు వచ్చాక ఆ డబ్బును ఆ విభాగంలో ఉన్న ఉద్యోగులు పంచుకోవటానికి స్కెచ్ వేసినట్లు తెలిసింది. దేవస్థానం ఉన్నతాధికారులు అన్నదానం విభాగంలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా, రోజూ సేవాబృందం సభ్యులు, దేవస్థానం తరఫున ఎంతమంది పనిచేస్తున్నారన్న విషయాలు బయటపడే అవకాశం ఉంది. ఆడిట్ అధికారులు కూడా ప్రత్యేక దృష్టిసారించి అమ్మవారి సొమ్ము పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దుర్గమ్మను దర్శించుకున్న భక్తులకు అందించే అన్నప్రసాదంలో కూడా పలువురు ఉద్యోగులు తమ చేతివాటం ప్రదర్శిస్తుండటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, దుర్గమ్మకు సేవ చేయాలని పలు సేవాబృందాల సభ్యులు ఎంతో ఆనందంగా దేవస్థానానికి వస్తుంటారు. అలాంటివారిని అవకాశంగా తీసుకుని దేవస్థానంలో కొందరు ఉద్యోగులు తమ జేబులు నింపుకొంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆభరణాలెక్కడ?

మోపిదేవి సుబ్బారాయుడి ఆభరణాల లెక్కల్లో జాప్యం

300 కేజీలకు పైగా ఆభరణాల విషయంలో నిర్లక్ష్యం

ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు 300 కేజీలకు పైగా వెండి, బంగారు ఆభరణాలు కరిగించి ఆరు నెలలైంది. ఇంతలో ఇద్దరు ఈవోలు మారినా.. ఆ ఆభరణాలు, వాటి లెక్కలు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో అధికారుల మధ్య జరిగిన ఈ జాప్యం భక్తులను కలవరపెడుతుండగా, అంతర్గత విభేదాలే ఇందుకు కారణమనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

- ఆరు నెలల కిందట కరిగించిన నాటి ఈవో
- నేటి ఈవోకు ఇంతవరకు అప్పగించని వైనం
- ఏమయ్యాయో తెలియక భక్తుల మండిపాటు

అవనిగడ్డ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి వెండి, బంగారు ఆభరణాల లెక్కల విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తులు నగదు రూపంలో గానీ, ఆభరణాల రూపంలో గానీ మొక్కుబడులు చెల్లిస్తుంటారు. ఇలా దాదాపు రూ.16 కోట్లకుపైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 300 కేజీలకుపైగా వెండి, బంగారు ఆభరణాలు ఆలయానికి సమకూరాయి.

లెక్కలు తేలేదెన్నడు?

ఆలయానికి సంబంధించి గత ఏడాది జూన్ నాటికి దాదాపు 3 వేలకుపైగా (300 కేజీలకుపైగా) వెండి, బంగారు నాగ పడగలు, ఆభరణాలు సమకూరినట్లు లెక్కలు తేలాయి. వెండి నాగ పడగలు, ఇతర చిన్నచిన్న ఆభరణాలు నిత్యం స్వామివారికి అలంకరించే అవకాశం లేకపోవటంతో నాటి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) నల్ల సూర్యచక్రధరరావు ఆ ఆభరణాలకు విలువ కట్టించి, వాటిని హైదరాబాద్‌లోని ఇంట్లో కరిగించినట్లుగా సమాచారం. ఆభరణాల కరిగింపు ప్రక్రియ పూర్తయిన రెండు నెలలకే నల్లం సూర్యచక్రధరరావు తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డిప్యూటీ కమిషనర్ హోదాలో దాసరి శ్రీరామ వరప్రసాదరావు.. మోపిదేవి ఆలయ దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇద్దరూ బాధ్యతలైతే స్వీకరించారు మిగతా 4లో..

కమిషనరేట్‌కు చేరిన 'పంచాయితీ'

మోపిదేవి ఆలయానికి సంబంధించి ఆభరణాల లెక్కలను అప్పగిద్దామంటే సహకరించటం లేదని ఇటీవల వాడపల్లిలో కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సూర్యచక్రధరరావు దేవదాయ శాఖ కమిషనరేట్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును మోపిదేవిలో కార్యనిర్వహణాధికారికి కమిషనర్ కార్యాలయం పంపించారు. అయినా ఇప్పటి వరకు మూడుసార్లు ఆభరణాల అప్పగింత ప్రక్రియ వాయిదా పడింది. కాగా, ఆరు నెలల నుంచి ఆభరణాల లెక్క తేలకపోవడంతో దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఏం చేస్తోందని భక్తులు ప్రశ్నిస్తున్నారు.



మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పని ఒత్తిడి వల్లే.. : ఈవో

ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఆభరణాల లెక్కలు మినహా మిగిలిన అన్ని చార్జీల బదలాయింపు పూర్తయిందని, ఆభరణాల లెక్కలు అప్పగించాల్సిందిగా తాను రెండు తేదీలు సూచిస్తూ కమిషనర్ కార్యాలయానికి లేఖ రాశానని తెలిపారు. అప్పగింత కార్యక్రమంలో జరిగిన జాప్యానికి రెండు దేవస్థానాల్లో ఉన్న పని ఒత్తిడే కారణం తప్ప మరే ఇతర కారణాలు లేవన్నారు. కొద్దిరోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉప సర్పంచ్‌ల ఎన్నికల్లో

కూటమి జోష్

ఉమ్మడి కృష్ణాలో 21 గ్రామ పంచాయతీలకు ఎన్నిక

- కూటమి 12 స్థానాలు, వైసీపీ 9 స్థానాలు కైవసం
- కొన్నిచోట్ల ఏకగ్రీవం.. మరికొన్నింట పరస్పర ఒప్పందం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీకి చెందినవారు మెజారిటీ స్థానాలు సాధించారు. పార్టీ రహితమే అయినా రాజకీయ మూలాలు కలిగి ఉండటంతో ఈ ఎన్నికలు కూడా ఉత్కంఠభరితంగానే జరిగాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 21 గ్రామ పంచాయతీలకు గానూ కూటమికి చెందిన అభ్యర్థులు 12 ఉపసర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. వైసీపీకి చెందినవారు 9 పొందారు. ఎన్టీఆర్ జిల్లాలో నాలుగు గ్రామ పంచాయతీలకు ఉపసర్పంచ్ ఎన్నికలు జరగ్గా, రెండు కూటమి, మరో రెండు వైసీపీకి చెందినవారు కైవసం చేసుకున్నారు.

ఎన్నికలు ఇలా..

- కృష్ణాజిల్లాలో మొత్తం 17 ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అన్నీ ఏకగ్రీవమయ్యాయి. పదింట్లో కూటమికి చెందినవారు, ఏడింట్లో వైసీపీకి చెందినవారు ఎన్నికయ్యారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, టీడీపీకి చెందిన ఎవరినీ వార్డు మెంబర్లుగా పోటీ చేయనివ్వకుండా చేసింది. అప్పట్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీ అత్యల్ప స్థానాలనే కైవసం చేసుకున్నప్పటికీ ప్రస్తుతం జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో కూటమికి చెందినవారే మెజారిటీ స్థానాలు పొందడం విశేషం. సాధారణ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘన విజయ ప్రభావం స్థానిక పంచాయతీలపైనా కొనసాగిందనే చెప్పవచ్చు.
- ఎన్టీఆర్ జిల్లాలో రామవరప్పాడు, కృష్ణాజిల్లాలో వణుకూరు పంచాయతీల్లో గతంలో ఓ ఒప్పందం ఉంది. ఉప సర్పంచ్ స్థానాలను టీడీపీ, వైసీపీ చెరి రెండున్నరేళ్లు పరిపాలించాలని నిర్ణయించుకున్నాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగించాయి. దీంతో మిగతా 4లో..

ఏఎంసీ మాజీ చైర్మన్‌పై చర్యలు తీసుకోండి

లేదంటే రాజీనామా



టీడీపీ అధిష్ఠానానికి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి అల్టిమేటం

- లైంగిక ఆరోపణలున్న వ్యక్తిపై చర్యలెందుకు తీసుకోరని ప్రశ్న
- 48 గంటల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని వెల్లడి
- ఎంపీ ఆఫీసులో మూల్పూరి కిషోర్‌కు ట్రాక్టర్ ఇచ్చాడని ఆరోపణ
- రమేశ్‌రెడ్డి కనిపిస్తే చెప్పు తెగే వరకు కొడతానని ఆగ్రహం
- నిరసన వ్యక్తం చేసిన మహిళలతో కలిసి కొలికపూడి వ్యాఖ్యలు

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరోమారు వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కారు. ఇప్పటికే అనేక ఆరోపణలతో వివాదాస్పదమైన ఆయన.. గురువారం అధిష్ఠానానికే అల్టిమేటం ఇచ్చారు. లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అలవాల రమేశ్‌రెడ్డిపై 48 గంటల్లోపు చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాననడంతో తిరువూరు రాజకీయం మరోసారి రచ్చకెక్కింది.

తిరువూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అలవాల రమేశ్‌రెడ్డిపై 48 గంటల్లోపు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అల్టిమేటం జారీ చేశారు. రమేశ్‌రెడ్డి నిర్వాకాలను ఇప్పటికే పార్టీ దృష్టికి తీసుకెళ్లానని, 48 గంటల్లోగా చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని గట్టిగా చెప్పారు. తిరువూరులోని ఎమ్మెల్యే కొలికపూడి నివాసానికి గురువారం ఏ.కొండూరు మండలంలోని పలు గిరిజన తండాలకు చెందిన మహిళలు వచ్చి నిరసన తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, పనుల కోసం వెళ్లేవారిని కామవాంఛ తీర్చమంటున్నాడని వారంతా వాపోయారు. రుణం కావాలని అడిగిన మహిళను లొంగదీసుకునేందుకు తీవ్ర మిగతా 4లో..

రుణాలిస్తామని తీసుకొచ్చారు

- ఎమ్మెల్యే మమ్మల్ని బలి పశువుల్ని చేశారు
- రమేశ్‌రెడ్డిపై ఆరోపణలు మాకు తెలియవు
- స్పష్టంచేసిన గిరిజన మహిళలు

4లో



అంకితభావంతో పనిచేస్తే కొడతారా?

- ఎమ్మెల్యే నన్ను రూ.2 కోట్లు అడిగారు
- ఇవ్వలేదని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు
- ఏఎంసీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

4లో

ముచ్చటగా మూడోసారి

పాల రైతులకు విజయ డెయిరీ మూడో విడత రూ.18 కోట్ల బోనస్

- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 1,200 కోట్ల టర్నోవర్
- వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ. 1,350 కోట్లు లక్ష్యం
- పాలకవర్గ సమావేశంలో చైర్మన్ చలసాని ఆంజనేయులు



మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు, వేదికపై పాలకవర్గ సభ్యులు

చిట్టినగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) పాల రైతులకు మూడో విడత రూ.18 కోట్ల బోనస్ ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పాల రైతులకు బోనస్‌ను ప్రకటించడం ఇది మూడోసారి. ఆగస్టులో రూ.18 కోట్లు, డిసెంబరులో రూ.14 కోట్ల బోనస్‌ను ప్రకటించారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులో రూ.1,200 కోట్ల మేర టర్నోవర్‌ను సాధించారు. ఈ క్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1,350 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. గురువారం మిగతా 4లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-24 (శుక్రవారం సాయంత్రం)

సహర్ : 04-45 (శనివారం ఉదయం)



నాగపుట్టలో పాలుపోస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు దంపతులు

సుబ్బారాయుడి సేవలో మంత్రి అచ్చెన్నాయుడు

మోపిదేవి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఏఒక్క రైతు ఆర్థికంగా నష్టపోకుండా వారికి ప్రయోజనం చేకూర్చటమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు మంత్రికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం కూటమి నేతలు, రైతులు మంత్రికి ధాన్యం కొనుగోలులో సమస్యలను వివరించారు. నియోజకవర్గంలోని పలు కొనుగోలు కేంద్రాల ఆధ్వర్యంలో ఉన్న మిల్లు యాజమాన్యాలు ఈనెల 15 నాటికే టార్గెట్లు పూర్తయ్యాయని, ధాన్యం కొనుగోలు చేయటం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రతి ధాన్యపు గింజను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా చూస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. రాబోయే కాలంలో వ్యవసాయం సాగుచేసే ప్రతీ రైతు ఆర్థికంగా ప్రయోజనం పొందేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



డిస్పెన్సరీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో ద్వారకా తిరుమలరావు, కొనకళ్ల నారాయణ తదితరులు

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అండ

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రూ. 80 లక్షలతో నిర్మించిన డిస్పెన్సరీ నూతన భవనాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎండీ ద్వారకా తిరుమలరావులతో కలిసి మంత్రి రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ద్వారకా తిరుమలరావు డీజీపీగా ఉత్తమ సేవలను గుర్తించి.. కష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించేందుకు ఆర్టీసీ ఎండీగా నియమించామన్నారు. ఆర్టీసీ బస్సులను విద్యుత్ వాహనాలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వలన ఆర్థిక భారం అయినప్పటికీ నిధులు ఇచ్చి ముందుకు నడిపిస్తామన్నారు. అవసరమైతే కొల్లు ఫౌండేషన్ ట్రస్టు ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, శిథిలావస్థలో భవనం అసౌకర్యంగా ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని నూతన భవనం నిర్మించామన్నారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో రాజమండ్రి, అనంతపురం, నరసాపురం, తిరుపతి, హిందూపురం, చిత్తూరు ప్రాంతాల్లో నూతన డిస్పెన్సరీలకు భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ ఉద్యోగి డిస్పెన్సరీల్లో ఎక్కడైనా ఆరోగ్య పరీక్షలు చేసుకోవచ్చన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు పాత పద్ధతిలోనే పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ, డ్రైవర్లు సకాలంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఈడీ రవివర్మ, ఈడీఈ చంగల్‌రెడ్డి, విజయరత్నం, చీఫ్ మెడికల్ ఆఫీసర్ అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం టు ఒంగోలుకు రెండు సర్వీసులు

మచిలీపట్నం నుంచి ఒంగోలుకు రెండు బస్సు సర్వీసులను గురువారం మంత్రి కొల్లు రవీంద్ర, చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎండీ ద్వారకా తిరుమలరావులు ప్రారంభించారు. ప్రతిరోజూ ఉ. 6 గంటలకు ఒకటి, 7 గంటలకు ఒక సర్వీసు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సర్వీసులు రేపల్లె మీదుగా వెళతాయని తెలిపారు.



మలబార్ షోరూం ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర

ఆంధ్రప్రదేశ్‌లో బంగారు గనులపై ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో బంగారం గనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. గురువారం రాజాసెంటర్‌లో మలబార్ షోరూంను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలో బంగారు గనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆభరణాల తయారీలో మచిలీపట్నంలో నిష్ణాతులైన పనివారున్నారని, వారి నైపుణ్యాలను వినియోగించుకోవాలన్నారు. మలబార్ కంపెనీ 5శాతం సీఎస్ఆర్ నిధులను కేటాయిస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ వ్యాపారులు పాల్గొన్నారు.

అన్నదాన విభాగంలో అవినీతి భోజనం

(3వ పేజీ తరువాయి)

నియమించుకుని విధులు నిర్వహించేవారు. ప్రతినెలా సుమారు రూ.5 లక్షలను దేవస్థానం సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించేది. కాంట్రాక్టర్ కాలపరిమితి ముగిశాక దేవస్థానమే సిబ్బందిని నియమించుకుని పని చేయిస్తోంది. కాగా, ఓ సేవాబృందం నిర్వాహకుడు తమ సభ్యులను 30 మందిని రోజూ భక్తులకు సేవ చేయించేందుకు పంపిస్తున్నారు. ఆ బృందం సభ్యులు ఉదయం 7 గంటలకు అర్జున వీధిలో ఉన్న శృంగేరి మఠంలోని అన్నదాన విభాగంలోకి వెళ్లి, కూరగాయలు తరిగి, ఇతర పనులు చేసి ఆ తరువాత మహామండపం రెండో అంతస్థులో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తుంటారు. శుక్ర, శని, ఆదివారాల్లో సుమారు 50 మంది వరకు వస్తుంటారు. దీనినే అదునుగా చేసుకుని అన్నదాన విభాగంలోని ఆ ఇద్దరు అధికారులు.. సేవాబృందంలోని సుమారు 20 మంది కూడా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దేవస్థానం తరఫున పనిచేసే సిబ్బందితో కలిపి బిల్లులు పెట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా మూడు నెలల బిల్లుల మొత్తం సుమారు రూ.20 లక్షలు పెండింగ్‌లో చూపినట్టు తెలుస్తోంది. ఈ బిల్లుల గురించి సంబంధిత ఉద్యోగులు పలుసార్లు ఈవో దృష్టికి కూడా తీసుకెళ్లారు. వీటిపై అనుమానం వ్యక్తం చేసిన ఈవో ఇటీవల అన్నదాన విభాగంలో తనిఖీలు నిర్వహించి పనిచేస్తున్న సిబ్బంది, సేవాబృంద సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది సేవాబృందం సభ్యులు విధుల్లో ఉండటాన్ని గమనించిన ఈవో వారి పేరుతో కూడా బిల్లులు పెట్టినట్లు గుర్తించి సంబంధిత ఉద్యోగులను నిలదీశారు. ఉచితంగా పనిచేసే వారి పేరుతో బిల్లులు ఎలా పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుప్పకూలిన కోల్డ్ స్టోరేజి

» ముగిసిన ఫైర్ అధికారుల ఆపరేషన్

జగ్గయ్యపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మూడురోజుల క్రితం పట్టణ ంలోని తొర్రగుంటపాలెంలో అగ్ని ప్రమాదానికి గురైన సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీ భవనం గురువారం పూర్తిగా కుప్పకూలిపోయింది. బుధవారం మధ్యాహ్నం మిర్చి, అపరాలు నిల్వఉంచిన బ్లాక్ వరకు కూలిపోగా, గురువారం మిగిలిన భాగం కుప్పకూలింది. మూడురోజులుగా జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏడు ఫైరింజన్లు, రెండు జేసీబీలు, 30మందికి పైగా సిబ్బంది శ్రమించి స్టోరేజి భవనాన్ని కూల్చివేశారు. మిర్చి కోరు, వేడి గాలులు, ఎండ వేడిమికి తట్టుకోలేక సిబ్బంది కోల్డ్ స్టోరేజిలోకి వెళ్లే మార్గం లేకపోవటంతో నీటిని, ఫోమ్‌ను పిచికారీ చేశారు. జగ్గయ్యపేట, నందిగామ, విస్సన్నపేట, గుడివాడ, విజయవాడల నుంచి ఫైరింజన్లతో పాటు రామ్‌కో, కేసీపీ సంస్థల ఫైరింజన్లను వినియోగించారు. డీఎఫ్ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. కోల్డ్ స్టోరేజిల్లో ఈ స్థాయి ప్రమాదం జిల్లాలో జరగలేదని, సిబ్బంది కృషితో మంటలను ఆర్పి, కోల్డ్ స్టోరేజిని కూల్చగలిగామని చెప్పారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



కుప్పకూలిన కోల్డ్ స్టోరేజి, దగ్ధమైన మిర్చిలో నుంచి వస్తున్న పొగలు

మే 1 నాటికి సారా రహిత జిల్లాగా కృష్ణా

» నవోదయం 2.0పై మంత్రి రవీంద్ర సమీక్ష

మచిలీపట్నం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాను మే 1 నాటికి సారా రహిత జిల్లాగా ప్రకటించేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 సారా నిర్మూలన కార్యక్రమంపై జిల్లా అధికారుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంపొందించి సారా నిర్మూలించేందుకు 'నవోదయం' కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. తద్వారా గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. సారా వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలు ప్రజలకు వివరించాలన్నారు. ఎక్సైజ్ పోలీసు, రెవెన్యూ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు కలసికట్టుగా కృషి చేసి మే 1న జిల్లాను సారా రహిత జిల్లాగా ప్రకటించాలన్నారు. సారా తయారీలో యూరియా, చెత్తతో పాటు బ్యాటరీల్లో ఉండే వ్యర్థ పదార్థాలను వినియోగిస్తున్నారని, దీనివల్ల ప్రజల ప్రాణాలకు నష్టమన్నారు. బడ్జెట్‌లో నవోదయం కార్యక్రమానికి రూ. 10 కోట్లు కేటాయించారన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డి అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, గ్రామాల్లో సారా విక్రయిస్తే తీవ్ర నేరంగా పరిగణించాలన్నారు. ఎస్పీ ఆర్. గంగాధరరావు మాట్లాడుతూ, సారా నిర్మూలనకు పోలీసుశాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. సారా కాసే ప్రాంతాలకు వెళ్లలేని పక్షంలో ఎనిమిది డ్రోన్ కెమెరాలు అందుబాటులో ఉంచామన్నారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, జిల్లాలో 14 గ్రామాల్లో సారా విక్రయాలు గుర్తించామన్నారు. 129 కేసులు పెట్టి 73 మందిని అరెస్టు చేశామన్నారు. అనంతరం బిళ్లపాడుకు చెందిన కళాకారులు వీరయ్య, ప్రశాంత్ బృందం సారా వల్ల అనర్థాలపై కళాజాత ప్రదర్శించారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్, ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస చౌదరి, సహాయ సూపరింటెండెంట్ భార్గవ్, ఆర్డీవోలు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

బాలికను గర్భవతిని చేసిన కేసులో

నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయవాడ లీగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో 20 ఏళ్ల జైలు, రూ.30 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానీ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కొత్తపేట స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో నివసించే ఫిర్యాదికి వివాహమై భర్త, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె (13) 8వ తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన జూటూరి దుర్గాప్రసాద్ (19) ప్రేమిస్తున్నానని వెంటపడి మాయమాటలు చెప్పి ఇంటిలో ఎవరూలేని సమయంలో లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కడుపు నొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పడంతో అనుమానం వచ్చి డాక్టర్‌కు చూపించగా గర్భవతి అని నిర్ధారించారు. జూటూరి దుర్గాప్రసాద్‌పై బాలిక తల్లి కొత్తపేట పోలీసు స్టేషన్‌లో 2022 జూలై 12న ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో, తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ వి.కృష్ణవేణి 14మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ జరిమానాలో నుంచి బాలికకు రూ.15 వేలు చెల్లించడంతో పాటు రూ.4 లక్షల నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీ వారిని ఆదేశించారు.

ముచ్చటగా మూడోసారి

(3వ పేజీ తరువాయి)

చిట్టినగర్‌లోని కృష్ణామిల్క్ యూనియన్‌లో పాలకవర్గ సమావేశం జరిగింది. చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ బోనస్ చెల్లింపుతో పాటు అధిక ధర చెల్లించడంలో కృష్ణా మిల్క్ యూనియన్ దేశంలోనే ముందువరసలో ఉందన్నారు. పాడి రైతులు, వినియోగదారులు రెండు కళ్లుగా పని చేస్తోందని, 72 రకాల పరీక్షలు చేసిన తర్వాత వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పాల పదార్థాలు అందిస్తోందని చెప్పారు. మూడో విడత బోనస్ ఏప్రిల్‌లో రూ.18 కోట్లు పంపిణీ చేస్తామన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్ల బోనస్‌ను మూడు విడతలుగా పాడి రైతులకు పంపిణీ చేశామని చెప్పారు. పాల సేకరణ ధర, బోనస్‌తో కలిపి సమితి పాడి రైతులకు కేజీ ఫ్యాట్‌కు రూ.902 చెల్లిస్తోందని, ఇది దేశంలోనే అత్యధిక ధర అన్నారు. నాణ్యమైన పశువైద్యం, సబ్సిడీపై పశుదాణా, పాల ఉత్పత్తిని మరింత పెంచేందుకు మేలు జాతి వీర్యాన్ని రూ.3 కోట్లు ఖర్చుచేసి పాడి రైతులకు సబ్సిడీపై ఈ ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేశామన్నారు. పాడి పశువుల షెడ్ల ఏర్పాటుకు, పశుగ్రాస అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక తోడ్పాటు ఎంతో ఆనందకరమంటూ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వరదల్లోనూ 'కామధేను' కార్యకలాపాలు

బుడమేరు వరద ముంపు సమయంలో 42 రోజులు విజయవాడ ఫ్యాక్టరీ మూతపడి రూ.24 కోట్ల నష్టం వాటిల్లినప్పటికీ ముందుచూపుతో నిర్మించిన కామధేను ఫ్యాక్టరీ కారణంగా, పాడి రైతులు, సమితి సిబ్బంది, వినియోగదారుల సహకారంతో రోజువారీ నిర్వహణలో ఎటువంటి ఆటంకం లేకుండా కార్యకలాపాలు సాగించామన్నారు. డాక్టర్ వర్గీస్ కురియన్ మార్గనిర్దేశాలకు అనుగుణంగా వినియోగదారుడి నుంచి ఆర్జించిన ప్రతి రూపాయిలో 85 శాతం పాడి రైతులకు అందజేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో విజయ డెయిరీ నూతన ఉత్పత్తులను ఆవిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని చలసాని తెలిపారు. ఈ సమావేశంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, వుయ్యూరు అంజిరెడ్డి, అర్జా వెంకట నగేశ్, చలసాని చక్రపాణి, వీటీకేవీ సుబ్బారావు, వేమూరి సాయి వెంకటరమణ, పల్లగాని కొండలరావు, బొట్టు రామచంద్రరావు, పాలడుగు వెంకట రామ వరప్రసాద్, నెలకుదిటి నాగేశ్వరరావు, చెరుకూరి లవయ్య, నెక్కలపు వాణిశ్రీ, శనగల వెంకట శివజ్యోతి, మద్దుకూరి వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రతిష్ఠను పెంచాం

» హోంమంత్రి వంగలపూడి అనిత

జగ్గయ్యపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠ పెరిగిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం పట్టణంలోని బీ కన్వెన్షన్ హాల్‌లో జగ్గయ్యపేట సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 509 సీసీ కెమెరాలను ఆమె వర్చువల్‌గా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్య, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, విజయవాడ సీపీ రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థ అప్రతిష్ఠపాలైందని, కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు పోలీసుల పనితీరులో మార్పు తీసుకువచ్చారన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, టెక్నాలజీ సాయంతో ఎన్టీఆర్ జిల్లా పటిష్ఠంగా మారిందని, సంపూర్ణ సీసీ కెమెరాలున్న నియోజకవర్గంగా జగ్గయ్యపేట రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.తొర్రగుంటపాలెంలో సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజి అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు.

ఆభరణాలెక్కడ?

(3వ పేజీ తరువాయి)

కానీ, మోపిదేవి స్వామివారి ఆభరణాల లెక్కలు మాత్రం తేల్చలేదు. బ్యాంక్ వివరాలకు సంబంధించి అన్ని బాధ్యతల బదలాయింపు పూర్తయినప్పటికీ ఆరు నెలలుగా ఆలయ ఆభరణాల లెక్కలు తేల్చలేదు. ఈ ఆభరణాల విలువ ఎంత..? ఎవరి సంరక్షణలో ఉన్నాయి..? అనే వివరాలు తెలియక భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అంతర్గత విభేదాలే కారణమా?

మోపిదేవి ఆలయంలో కార్యనిర్వహణాధికారిగా పనిచేసి, వాడపల్లికి బదిలీ అయిన నల్లం సూర్య చక్రధరరావుకు, ప్రస్తుత ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు మధ్య అంతర్గత విభేదాలే ఆభరణాల లెక్క ఇంకా తేలకపోవడానికి కారణమని తెలుస్తోంది. గతంలో మావుళ్లమ్మ తల్లి ఆభరణాల లెక్కల విషయంలో ఈ ఇద్దరు అధికారుల మధ్య సహృద్భావ వాతావరణం లేదు. కొన్ని నెలలపాటు ఆభరణాల లెక్కల బదలాయింపు ఆలస్యమైంది. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం స్పందించి ఆభరణాలకు సంబంధించి లెక్కలు తేల్చి, వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించటంతో అప్పటికి స్పందించారు. సరిగ్గా మోపిదేవి ఆలయం విషయంలో కూడా ఇలాగే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రాష్ట్రానికి రూ.555 కోట్లతో

612 కి.మీ రహదారి పనులు

» కేంద్రమంత్రి దుర్గాదాస్ వెల్లడి



వన్‌టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్ నుంచి పీఎం జన్మన్ పథకం కింద ఇప్పటి వరకు 206 రహదారులకు ప్రతిపాదనలు వచ్చాయని, ఇంకా 9.77 కి.మీ పొడవు రహదారి, 27 పొడవాటి స్పాన్ బ్రిడ్జిలు గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నమోదు చేసిందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ కింద ఇప్పటి వరకు మొత్తంగా ఏపీలో 612.718 కిలో మీటర్ల పొడవు రహదారికి గాను 200 రహదారి పనులు మంజూరయ్యాయని, ఇందుకు 555.60 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. అయితే మంజూరైన రహదారి పనుల పనితీరును పరిశీలించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి ప్రత్యేక అధ్యయనం చేపట్టలేదన్నారు.

చర్యలు తీసుకోండి.. లేదంటే రాజీనామా

(3వ పేజీ తరువాయి)

ఒత్తిడి తెచ్చాడని తెలిపారు. మహిళలతో నీచంగా ప్రవర్తిస్తున్న రమేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే కొలికపూడి స్పందించారు. రమేశ్ రెడ్డి లైంగిక వేధింపుల విషయం ఇప్పటికే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లానని, 48 గంటల్లో చర్యలు తీసుకోకపోతే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు. 'ఎమ్మెల్యే అంటే నాకు భయమా, నాపై ఎంపీ ఈగవాలనివ్వడు. ఎంపీ ఆఫీసులో మూల్పూరు కిషోర్‌కు తనను కాపాడమని నాలుగు ట్రాక్టర్లు, రూ.50 లక్షలు డబ్బు ఇచ్చాను.' అని రమేశ్ రెడ్డి చెబుతున్నాడని, దీనిపై తాను విచారణ జరపగా, ఒక్క ట్రాక్టర్ ఇచ్చాడని తేలిందన్నారు. డబ్బు ఇచ్చిన విషయం మాత్రం తెలియదన్నారు. రమేశ్‌రెడ్డి తన దగ్గరకొచ్చినా, పార్టీ కార్యక్రమాల్లో కనిపించినా చెప్పు తెగేదాకా కొడతానని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను 10 రోజుల నుంచి ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు, పరిశీలకుడికి చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రమేశ్‌రెడ్డి ఆడియో విన్న తర్వాత నిలువునా పాతర వేయాలని అనిపించిందన్నారు. ఒక పెద్ద నాయకుడిని చెప్పాక.. రెండు మూడు రోజుల్లో చర్యలు ఉంటాయని భావించానని, కానీ అది జరగలేదన్నారు.

బ్యాలెన్స్‌గా, బాధ్యతాయుతంగా ఉంటున్నా..

శాసనసభ్యుడిగా ఉన్నందున చాలా బ్యాలెన్స్‌గా, బాధ్యతాయుతంగా, పార్టీకి ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో 12, 13 రోజుల నుంచి కంట్రోల్ చేసుకుని ఉంటున్నానని ఎమ్మెల్యే కొలికపూడి అన్నారు. ఒక గిరిజన మహిళ రుణం అడిగితే.. అసభ్యకరంగా మాట్లాడిన ఓ నాయకుడిపై ఇప్పటి వరకు వరకు స్పందించలేదంటే ఎలా..? అని ప్రశ్నించారు. అదే ఇతర కులాల నాయకులైతే ఇలాగే స్పందిస్తారా? కులాలకు ఓ న్యాయమా? నాయకుడికి మరో న్యాయమా? అని పార్టీ పెద్దలను అడుగుతున్నానన్నారు. తండాల మహిళలు తమ సమస్యలను చెప్పుకోనేందుకు తిరువూరు వస్తుంటే, వైసీపీకి చెందిన నాయకులు వైకుంఠరావు, చిన్నయ్య దొరలు.. వారిని బెదిరింపు ధోరణితో అడ్డుకుంటున్నారని, తప్పుచేసిన టీడీపీ నాయకుడ్ని కాపాడేందుకు వైసీపీ నాయకులు ఎందుకు తాపత్రయపడుతున్నారని కొలికపూడి ప్రశ్నించారు. చివరకు ఒక పాస్టర్ సైతం ఫోన్ చేశారని ఆయన ఆరోపించారు. ఎ.కొండూరు గిరిజన తండాల్లో 320 మరుగుదొడ్ల నిర్మాణం పేరుతో రమేశ్‌రెడ్డి నిధులు కైంకర్యం చేస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి బలయ్యాడని ఎమ్మెల్యే ఆరోపించారు. నియోజకవర్గంలో వంద టిప్పర్లు మట్టి తోలకాలు చేస్తుంటే, మూడు టిప్పర్లపై కేసు నమోదు చేశారని, 97 టిప్పర్లను పట్టించుకోలేదని, మట్టి తోలకాల వెనుక ఎవరున్నారో నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే కోరారు. కేసులు నమోదు చేసిన టిప్పర్లు ఎవరివని, కేసులు నమోదు చేయని టిప్పర్లు ఎవరివని ప్రశ్నించారు.

తిరువూరులో ఓపెన్ డిబేట్‌కు రండి

నియోజకవర్గంలో తానేమీ చేయకపోయినా నేరాలు, ఘోరాలు జరుగుతున్నాయని చాలామంది చెబుతున్నారని, నాపై మీడియాలో, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారు తిరువూరు జనాలను తన గురించి అడగాలన్నారు. ఎక్కడో హైదరాబాద్, విజయవాడలో కూర్చుని యూట్యూబ్‌లో వీడియోలు పెట్టే వారికి సమాధానం చెప్పడానికి ఒక్క నిమిషం చాలన్నారు. నాపై మూడుసార్లు ఆరోపణలు చేశారని, ఒక్క దానికైనా సాక్ష్యం ఉందా అని ప్రశ్నించారు. తనపై ఆరోపణలు చేసే వారెవరైనా తిరువూరులో ఓపెన్ డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు.

రుణాలు ఇస్తామని తీసుకొచ్చారు..

- తూర్పుమాధవరం తండా మహిళలు



ఎ.కొండూరు : కూలిపనులు చేసుకుంటున్న తమకు లోన్లు ఇప్పిస్తామని, తండాకు చెందిన నాయకుడు ఒకరు మభ్యపెట్టి తిరువూరు తీసుకువెళ్లాడు. ఎమ్మెల్యే రాజకీయానికి మమ్మల్ని బలిపశువులుగా చేస్తున్నారు. రమేష్‌రెడ్డిపై ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలు ఏమాత్రం తెలియవు.. ఎమ్మెల్యే వ్యాఖ్యలకు కంగుతిని బయటకు వెళ్లిపోయాం. మమ్మల్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం తగదు.

పార్టీ కోసం పనిచేస్తే కొడతారా..

- అలవాల రమేష్‌రెడ్డి



ఎ.కొండూరు : ఎన్నికల్లో పార్టీ విజయానికి శ్రమించినందుకు, కొడతారా.. ఎమ్మెల్యే గారు.. ఎన్నికల అనంతరం తనను ఎమ్మెల్యే రూ.2 కోట్లు అడిగారు.. మండలంలో సిమెంట్ రోడ్ల కాంట్రాక్టు ఇస్తానని, 10 శాతం కమీషన్ ఇవ్వాలని కోరగా.. తాను ఒప్పుకోకపోవడంతో, తప్పుడు ఫోన్ సంభాషణలు రికార్డు చేయించి, తనపై తప్పుడు ప్రచారంచేసే నీచస్థాయికి ఎమ్మెల్యే దిగజారాడు. మూడు దశాబ్దాలుగా పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్నా. తండా ప్రాంతంలోనే నివాసం ఉంటున్నాం. ఏ ఒక్క గిరిజన కుటుంబమైనా నా వల్ల ఇబ్బంది పడినట్టు ఫిర్యాదు చేశారా.. ఎమ్మెల్యేగా తండాల అభివృద్ధి చేయకపోయినా తండా వాసుల్ని కుట్ర రాజకీయాలకు బలిచేసే యోచన ఎమ్మెల్యే విరమించుకోవాలి.

ఉప సర్పంచ్‌ల ఎన్నికల్లో కూటమి జోష్

(3వ పేజీ తరువాయి)

రామవరప్పాడు పంచాయతీలో వైసీపీకి చెందిన పాలకవర్గమే మెజారిటీగా ఉన్నప్పటికీ ఉప సర్పంచ్ స్థానాన్ని మాత్రం టీడీపీకి చెందిన వార్డు మెంబర్‌కు కేటాయించారు. నాటి ఒప్పందం ప్రకారం వైసీపీ ఉప సర్పంచ్ రాజీనామా చేశారు. కృష్ణాజిల్లాలోని కేసరపల్లి పంచాయతీలో పార్టీలకతీతంగా అభ్యర్థిని ఎంపిక చేసుకున్నారు. ఇలా కొన్ని పంచాయతీల్లో అందరికీ తెలిసేలా, మరికొన్నింటిలో ఎవరికీ తెలియకుండా పరస్పర ఒప్పందాల మేరకు ఏకగ్రీవం చేసుకున్నారు.

- నందిగామ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నందిగామ మండల పరిషత్‌లో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వైసీపీకి చెందినవారు 13 మంది, టీడీపీకి ఒక ఎంపీటీసీ స్థానం ఉంది. వైసీపీ ఎంపీటీసీ ఒకరు టీడీపీలోకి రావటంతో వైసీపీ 12, టీడీపీ 2 ఉన్నాయి. దీంతో ఎంపీపీగా కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ పెనరమెల్లి రమాదేవి పేరును ఆ పార్టీ ప్రతిపాదించగా, ఎన్నిక ఏకగ్రీవమైంది.

కృష్ణా జిల్లాలో గెలిచిన ఉపసర్పంచ్ స్థానాల వివరాలు ఇవీ :

మండలం	గ్రామం	పేరు	పార్టీ
పెడన	కాకర్లంపూడి	రావి విజయలక్ష్మి	జనసేన
పెడన	అచ్చయ్యవారిపాలెం	పామర్తి రాముడు	టీడీపీ
ఘంటసాల	శ్రీకాకుళం	శీలం శ్రీనివాసరావు	టీడీపీ
గుడ్లవల్లేరు	శేరికల్వపూడి	గోగులమూడి వెంకటేశ్వరమ్మ	టీడీపీ
గన్నవరం	కేసరపల్లి	జాస్తి శ్రీధర్‌బాబు	టీడీపీ
గన్నవరం	అల్లాపురం	గుండాల అచ్చయ్య	వైసీపీ
పమిడిముక్కల	తాడంకి	కొల్లి లక్ష్మి	వైసీపీ
పమిడిముక్కల	మంటాడ	కలాపురెడ్డి రమాదేవి	టీడీపీ
పమిడిముక్కల	అమీనాపురం	నందేటి దుర్గా ప్రవీణ్‌కుమార్	టీడీపీ
పమిడిముక్కల	ఫతేలంక	షేక్ లాల్ అహ్మద్	వైసీపీ
ఉంగుటూరు	పెదవుటపల్లి	మరీదు ఉషారాణి	టీడీపీ
తోట్లవల్లూరు	పెనమకూరు	పేరుబోయిన జేజమ్మ	వైసీపీ
తోట్లవల్లూరు	యాకమూరు	బూరి సాంబమూర్తి	వైసీపీ
గూడూరు	అకులమన్నాడు	బీ హరీష్	జనసేన
మోపిదేవి	నాగతిప్ప	పెనుమత్స లక్ష్మీ వెంకట రమణ	వైసీపీ
మచిలీపట్నం	భోగిరెడ్డిపల్లి	కొక్కిలగడ్డ రవి	జనసేన
పెనమలూరు	వణుకూరు	ఆరేపల్లి నాగరాజు	వైసీపీ

ఎన్టీఆర్ జిల్లా లో ఉపసర్పంచ్ స్థానాలు గెలిచిన వివరాలు ఇవీ :

మండలం	గ్రామం	పేరు	పార్టీ
జీ కొండూరు	కట్టుబడిపాలెం	బాణావత్తు వెంకటేశ్వరరావు	వైసీపీ
ఇబ్రహీంపట్నం	తుమ్మలపాలెం	నండూరి బేబి	టీడీపీ
వత్సవాయి	మంగొల్లు	మెట్టెల పద్మ	వైసీపీ
విజయవాడ రూరల్	రామవరప్పాడు	అద్దేపల్లి సాంబశివనాగరాజు	టీడీపీ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

సీఎం చంద్రబాబు స్వర్ణభారత్ ట్రస్ట్‌కు రాక 30న

ఉంగుటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో ఈనెల 30వ తేదీ సాయంత్రం 3 గంటలకు నిర్వహించే శ్రీవిశ్వావసు నామసంవత్సర ఉగాది సంబరాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు పాల్గొంటారని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మణ్ణి దీపావెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు రానున్న దృష్ట్యా ఏర్పాట్లను గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, డీఎస్పీ చలసాని శ్రీనివాసరావుతో కలిసి జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ గురువారం పరిశీలించారు. హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు కాల్వ ఆధునీకరణ చేపట్టాలి



డీఈఈ బి.ఆంజనేయప్రసాద్‌కు మొక్కను అందజేస్తున్న ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల

హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏలూరు కాలువ ఆయుకట్టులోని చివరి భూములకూ సకాలంలో సాగునీరందించేందుకు పూడికతీత పనులతో పాటు గుర్రపుడెక్కను తొలగించేలా ఆధునీకరణ పనులు మొదలు పెట్టాలని కృష్ణా తూర్పు డెల్టా డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. ఆంజనేయప్రసాద్‌ను ఎస్‌ఎస్పీ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ కోరారు. విజయవాడలోని జలవనరులశాఖ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయప్రసాద్‌ను గురువారం వారు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి సత్కరించారు. వేలాది ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించే ఏలూరు కాలువ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గుర్రపుడెక్కతో, పొదలతో పూడిపోయిందని ఈ వేసవిలోనే ఆధునీకరణ పనులు మొదలుపెట్టి రైతులకు సకాలంలో సాగునీరందేలా చూడాలని కోరారు. ఎనికేపాడు వద్ద బుడమేరు అండర్‌టన్నెల్ వెడల్పుచేసి అధిక వర్షాల సమయంలో ఏలూరు కాలువ కట్టలు తెగిపోకుండా బలోపేతం చేయాలని కోరారు. కాలువ చివరి ప్రాంతమైన పెరికీడు-1, 2 డ్రెయిన్ల పూడిక తీత, నాన్ నోటిఫైడ్ డ్రెయిన్లలో ఉపాధిహామీ పనుల ద్వారా పూడితతీత పనులు చేసేలా చూడాలని కోరారు. సమస్యలను జలవనరుల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయకట్టుదారులకు సకాలంలో సాగునీరందేలా చూస్తానని డీఈఈ హామీ ఇచ్చారని ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి

● అధికారులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశం



తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం పోరంకిలోని తన కార్యాలయంలో ఆయన నియోజకవర్గ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలోని నీటి వనరులను గుర్తించి, అవసరమైన చోట మరమ్మతులు చేయించి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ పథకంలో మిగిలి ఉన్న లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. ఉయ్యూరు మండల పరిషత్ నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డీఈలు శ్రీనివాస్, బలరాం, నారాయణ, ఎంపీడీవోలు ప్రణవి, శేషగిరి, విస్తరణాధికారులు, ఏఈలు పాల్గొన్నారు.



రామవరప్పాడు ఉప సర్పంచ్‌గా ఎన్నికైన అద్దేపల్లి సాంబశివనాగరాజుకు అభినందనలు తెలియజేస్తున్న సర్పంచ్ వరి శ్రీదేవి



పెద అవుటపల్లి ఉపసర్పంచ్‌గా ఎన్నికైన ఉషారాణికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి ప్రసాద్



కేసరపల్లి ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఈవోపీఆర్డీ భారతి

ఏకగ్రీవ ఉపసర్పంచ్‌లకు అభినందన

టీడీపీ ఖాతాలోకి రామవరప్పాడు ఉపసర్పంచ్

గుణదల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడు ఉప సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు ఆరో వార్డు సభ్యుడు అద్దేపల్లి సాంబశివనాగరాజు (సాంబు) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈవోఆర్డీ ఎండీ ప్రసాద్ ప్రకటించారు. ఉప సర్పంచ్ పదవి టీడీపీ ఖాతాలో పడిపోవడం పంచాయతీలో మెజారిటీ సభ్యులంతా టీడీపీకి అనుకూలంగా వ్యవహరించడంతో చేసేది లేక వైసీపీ మద్దతుదారు, సర్పంచ్ వరి శ్రీదేవి కూడా టీడీపీ అభ్యర్థికే మద్దతిచ్చారు. రామవరప్పాడు పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులు వైసీపీ ఖాతాలో ఉండేవి. నెల క్రితం ఉప సర్పంచ్ వంగూరి పుణ్యవతి తన పదవికి రాజీనామా చేశారు. ఉప సర్పంచ్‌ను చేజార్చుకోకూడదని వారం కితం వైసీపీ సభ్యులు ఎన్నిక్నై నిర్ణయం తీసుకునేందుకు సమావేశానికి హాజరు కావాలని సూచిస్తే 17 మంది సభ్యులకు తొమ్మిది మందే హాజరయ్యారు. ఉపఎన్నికకు 24 గంటల ముందు వరకు వైసీపీ సభ్యులు ఓ సభ్యుడిని నిలబెట్టాలని ప్రయత్నించినా అతను ముందుగానే జారుకున్నారు. 18వ వార్డు మెంబర్ చిన్నా సుధను ఉపసర్పంచ్‌గా పోటీకి నిలబెడుతున్నట్లు ఏడో వార్డు సభ్యురాలు లోకసాని లక్ష్మి ప్రతిపాదించినా సభ్యులు సానుకూలత వ్యక్తం చేయలేదు. అద్దేపల్లి సాంబశివనాగరాజును ఉప సర్పంచ్‌గా రాజీనామా చేసిన వంగూరు పుణ్యవతి ప్రతిపాదించారు. సభ్యులంతా మద్దతు ప్రకటించారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రసాదంపాడు మాజీ సర్పంచ్ బొప్పన హరికృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు గుజ్జర్లపూడి బాబూరావు తదితరులు అభినందనలు తెలిపారు. టీడీపీ అభిమానులు అద్దేపల్లికి అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి : ఎమ్మెల్యే యార్లగడ్డ



సాంబశివ నాగరాజును అభినందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీ పడకుండా పని చేయాలని ఉప సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన అద్దేపల్లి సాంబశివరావు, మరీదు ఉషారాణికి ప్రభుత్వ విప్. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. గురువారం గన్నవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏకగ్రీవమైన ఉప సర్పంచ్‌లు యార్లగడ్డను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యార్లగడ్డ శుభాకాంక్షలు తెలిపారు. రామవరప్పాడు మాజీ ఉప సర్పంచ్ కొల్లా ఆనంద్, పెద్ద అవుట్‌పల్లి గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద అవుటపల్లి ఉపసర్పంచ్‌గా ఉషారాణి

ఉంగుటూరు : పెదఅవుటపల్లి ఉప సర్పంచ్‌గా ఎనిమిదో వార్డు సభ్యురాలైన మరీదు ఉషారాణి(టీడీపీ)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచ్‌గా ఉన్న రెండో వార్డు సభ్యుడు మూల్పూరి సాయి ఏడాదిక్రితం రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో ఉపసర్పంచ్ ఎన్నిక పంచాయతీ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, మండలపరిషత్ ఏవో(సూపరింటెండెంట్), జేవీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. 14మంది పాలకవర్గసభ్యులకు 10 మంది హాజరయ్యారు. ఉపసర్పంచ్‌గా ఉషారాణి పేరును నాలుగో వార్డు సభ్యుడు వేమూరి సుధీర్‌కుమార్ ప్రతిపాదించగా, ఒకటో వార్డు సభ్యుడు షేక్ అల్లాభక్షు బలపరిచారు. సభ్యులందరూ ఉషారాణిని ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రిసైడింగ్ అధికారి ప్రసాద్ ఉషారాణికి ధ్రువీకరణ పత్రం అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ నాయకులు ఆమెను అభినందించారు. సర్పంచ్ బాణావతు తిరుపతమ్మ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వి.సూర్యప్రకాష్‌నాథ్, పంచాయతీ సెక్రటరీ జంగం యోహాన్, టీడీపీ సీనియర్ నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, ఆళ్ల హనోక్, మున్నా రామకృష్ణ, కుందేటి చంద్రశేఖర్, గన్నవరం ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు పాల్గొన్నారు.

కేసరపల్లి ఉపసర్పంచ్‌గా జాస్తి శ్రీధర్‌బాబు

గన్నవరం : కేసరపల్లి, అల్లాపురం పంచాయతీల్లో గురువారం ఉపసర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కేసరపల్లి ఒకటో వార్డు సభ్యుడు జాస్తి శ్రీధర్‌బాబు(చిన్ని) ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈవోపీఆర్డీ భారతి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఉపసర్పంచ్‌గా ఉన్న గద్దం అంకమ్మ రాజీనామా చేయడంతో అధికారులు ఎన్నికకు ఉత్తర్వులు ఇచ్చారు. శ్రీధర్‌బాబును 16 మంది వార్డు సభ్యులు ఆమోదించటంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, పలగాని బాలకృష్ణ, మన్నె సుబ్బారావు, పొట్లూరి బసవరావు తదితరులు శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అల్లాపురం ఉపసర్పంచ్‌గా మూడో వార్డు సభ్యుడు గుండాల అచ్చియ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సూపరింటెండెంట్ శకుంతల ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.



వణుకూరు ఉపసర్పంచ్‌గా ఆరేపల్లి నాగరాజు

కంకిపాడు: వణుకూరు ఉపసర్పంచ్‌గా రెండో వార్డు సభ్యుడు ఆరేపల్లి నాగరాజు ఎన్నికయ్యారు. 13వ వార్డు సభ్యుడు గద్దెల రాజేంద్ర, 2వ వార్డు సభ్యుడు ఆరేపల్లి నాగరాజు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం గద్దెల రాజేంద్ర ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఆరేపల్లి నాగరాజు ఉపసర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈవోపీఆర్డీ బొమ్మసాని శ్రీనివాసరావు, సర్పంచ్ చక్కా విజయ రామలక్ష్మి పర్యవేక్షించారు. ఆరేపల్లి నాగరాజును వార్డు సభ్యులు అభినందించారు.

ఉచిత కంటివైద్య శిబిరం నేడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వీరవల్లి పీఏసీఎస్ ఆవరణలో శంకర గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు గరికపాటి శివశంకర్ గురువారం తెలిపారు. వీరవల్లి పీఏసీఎస్ ఆవరణలో ఉదయం 9గంటల నుంచి, కంటి వైద్యులు పరీక్షలు చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల సమావేశం రేపు

హనుమాన్‌జంక్షన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఎంపీపీ నగేష్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో తాగునీటి సమస్య, వివిధ అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని తాపీ మేస్త్రీ మృతి

ఆటోనగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని తాపీమేస్త్రీ మృతి చెందిన ఘటన గురువారం పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని యనమలకుదురు లాకుల రోడ్డు సూర్య బార్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యనమలకుదురు జెండాచెట్టు సెంటర్‌కు చెందిన తాపీ మేస్త్రీ షేక్ మీరావలి(33) బుధవారం రాత్రి 10 గంటలకు పని కోసం వెళ్లాడు. గురువారం ఉదయం 7.30 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు కుమారుడి ఫోన్ నుంచి తల్లి షేక్ ఫాతిమున్నీసాకు స్థానికులు తెలిపారు. దీనిపై షేక్ ఫాతిమున్నీసా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి. పవన్ కిషోర్ తెలిపారు. మృతుడికి భార్య, ఐదు నెలల కుమారుడు ఉన్నారు.

సైకిల్ దెబ్బకు సైకో పరార్

● మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి ● ముగ్గురు సర్పంచ్‌లు టీడీపీలో చేరిక



వివిధ గ్రామాల సర్పంచులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా

కంకిపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సైకిల్ దెబ్బకు సైకో బెంగళూరు పరారయ్యాడని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మండలంలోని ఉప్పలూరు సర్పంచ్ లాం సోనియా, తెన్నేరు సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా, మారేడుమాక సర్పంచ్ చోడవరపు ఆదర్శకుమార్‌లకు ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజాలతో కలిసి ఆమె టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దళితులను మాజీ సీఎం జగన్ అనేక అవమానాలకు గురి చేశారన్నారు. రాష్ట్ర ప్రజలతో మూడు ముక్కలాట ఆడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన ఈ 9 నెలల్లో తొమ్మిది రోజులు కూడా ఖాళీగా కుర్చోలేదన్నారు. ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప్పలూరు గ్రామ అభివృద్ధికి రూ. కోటి మంజూరు చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ నాయకులు రాజా, రాధా కృష్ణ మూర్తి,సుబ్రహ్మణ్యం, సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జంక్షన్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న పాస్టర్లు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని జంక్షన్ క్రైస్తవ ఫెలోషిప్ డిమాండ్ చేసింది. గురువారం జంక్షన్ సెంటర్‌లో బాపులపాడు మండలంలోని పాస్టర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రవీణ్ మృతికి కారణాలు వెలికితీసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు రత్నబాబు, అధ్యక్షుడు రత్నభూషణ్, ఉపాధ్యక్షుడు పేతురు, శుభాకర్, కిరణ్‌పాల్, అబ్రహం, పుష్పరాజ్ పాల్గొన్నారు.



పవిత్ర శిలువ మార్గం

గన్నవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : పాపుల రక్షణకు ప్రభువైన యేసుక్రీస్తు శిలువనెక్కారని కొండపావులూరు విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ తోకల సురేష్ తెలిపారు. చిక్కవరం ఆర్సీఎం దేవాలయం నుంచి గురువారం పవిత్ర శిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రమదినాల్లో యేసుక్రీస్తు అనుభవించిన పలు ఘట్టాలను వివరించారు. 14 స్థలాల వద్ద క్రైస్తవ భక్తి గీతాలు ఆలపిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపదేశికులు దోమతోటి పవన్‌కుమార్, సంఘ పెద్దలు తంగెళ్లమూడి అచ్చయ్య, నువ్వుల సురేష్, లోకేష్, డాన్‌బాస్కో యూత్ సభ్యుడు, మరియదళం సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు మేలు

ఉంగుటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం సూచించారు. రీసర్వే కొలతలపై రైతుల అభ్యంతరాలు కోరుతూ గురువారం పెదఅవుటపల్లిలో తహసీల్దార్ జె.విమలకుమారి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రీసర్వే అధికారులు 300 మంది రైతులకు 9(2) నోటీసులు అందజేశారు. రీసర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను ఆర్డీవో వివరించారు. రైతుల అర్జీలను ఆయన స్వీకరించారు. జిల్లా సర్వే లాండ్స్ అండ్ రికార్డ్స్ అధికారి జోషిలా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నరసింహారావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, ఆర్ఐ సూర్యకాంతి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

కళలకు ప్రోత్సాహం అవసరం

ఉయ్యూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కనుమరుగవుతున్న కళలను ఆదరించి ప్రోత్సహించాలని నాటక రంగ కళాకారుడు, ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు అన్నారు. ప్రపంచ కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగళ్ల రాజేశ్వరమ్మ జానకిరామయ్య విజ్ఞాన కేంద్రం ఆవరణలో గురువారం పూర్ణచంద్రరావు అధ్యక్షతన రంగస్థల కళాకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించి పలువురు కళాకారులను సత్కరించారు. ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డి.గోపి, సోమేశ్వరరావు, రవి, లక్ష్మయ్య, సూరి, ప్రకాశరావు, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, మురళి, సాంబశివరావు కళాకారులను సత్కరించారు. గుర్తింపు పత్రాలు అందజేశారు.

సీనియర్ అకౌంటెంట్ ఎం.రవికి మొవ్వ ఎస్టీవోగా పదోన్నతి

గన్నవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న ఎం.రవికి ఎస్టీవోగా పదోన్నతి లభించింది. మొవ్వ ఎస్టీవోగా వెళుతున్న రవిని గురువారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యాలయంలో నాయకులు సత్కరించారు. రవి మరిన్ని పదోన్నతులు పొందాలని అసోసియేషన్ అధ్యక్షుడు వి.సాంబశివరావు ఆకాంక్షించారు. ఎస్టీవో నాగరాజు, హరీష్, విజయకుమార్, కిషోర్ నాయకులు దామెర సీతారామయ్య, శ్రీనివాస్, శివ ప్రసాద్, కంకిపాడు వెంకటేశ్వరరావు, మరీదు వరప్రసాద్, దాసరి శివప్రసాద్, కెఎస్. జగదీశ్వరరావు, నాయక్, జోజయ్య పాల్గొన్నారు.



మానవత సభ్యుడు శరీర దానం

హనుమాన్‌జంక్షన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సంస్థ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కూరెళ్ల సుబ్బాచారి తన మరణానంతరం దేహాన్ని దానం చేశారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి దానం చేస్తూ గురువారం ధ్రువపత్రాలను అందజేశారు. సుబ్బాచారిని ఆ సంస్థ సెంట్రల్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తదితరులు అభినందించారు.

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

గుడివాడ మునిసిపాలిటీకి ఆశీల అదాయం రూ.14.19లక్షలు

గుడివాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో నిర్వహించిన ఆశీల పాటల ద్వారా రూ.14.19 లక్షల ఆదాయం సమకూరిందని కమిషనర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కూరగాయల ఆశీలు, చేపలు, మాంసం మార్కెట్, గొర్రెలు, మేకల వధశాల ఆశీలు, పశు వధశాల ఆశీలు వసూలు చేసుకునే హక్కు కోసం వేలం నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా, వారిలో పంచకర్ల అమర్‌కుమార్ రూ.14.19లక్షలతో దక్కించుకున్నారు. కబేళా, మాంసం, చేపల మార్కెట్ ఆశీలకు నిర్వహించిన వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో ఈనెల 29వ తేదీకి వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మేనేజర్ ఇన్‌చార్జ్ జి.టి.నాయుడు, రెవెన్యూ అధికారి జోజి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

మైనార్టీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

గుడివాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం బంటుమిల్లి రోడ్డులోని మియాఖాన్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని మైనార్టీలకు అండగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మైనార్టీ నాయకులు జానీ షరీఫ్, షేక్ ఇబ్రహీం, అబ్దుల్ మున్వర్, రఫీ, షేక్ సర్కార్, సయ్యద్ గఫార్, మసీదు కమిటీ అధ్యక్షుడు వలీ, టీడీపీ నాయకులు రాంబాబు, సత్యనారాయణ, లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహనరావు, రమేష్, శివ పాల్గొన్నారు.

విద్యార్థినికి వేధింపులు.. అధ్యాపకుడి సస్పెన్షన్

గుడ్లవల్లేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అంగలూరు డైట్ కళాశాల విద్యార్థినికి అసభ్యకర ఫోన్ సందేశాలు పంపుతూ వేధిస్తున్న అధ్యాపకుడిని డీఈవో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ సలీమ్ బాషా తెలిపారు. ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం..డోకిపర్రు హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ అంగలూరు డైట్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న కె.హరికిరణ్ కళాశాలలో చదువుతున్న ఒక విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఫోన్ మెసేజ్‌లు పంపుతున్నారని విద్యార్థిని ఈనెల 22వతేదీన ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదును డీఈవో దృష్టికి ప్రిన్సిపాల్ తీసుకెళ్లారు. దీంతో హరికిరణ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు బుధవారం ఆదేశాలు వచ్చాయని, వాటిని హరికిరణ్‌కు పంపామని ప్రిన్సిపాల్ తెలిపారు. తదుపరి విచారణ చేసి చర్య తీసుకుంటామని స్పష్టం చేశారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

గుడివాడ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చిన్న ఎరుకపాడు వద్ద ఈనెల 15వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పరమానుపాండు అనే చేపల వ్యాపారిపై నలుగురు దాడి చేశారు. ఈ కేసులో మొదటి నిందితుడు అంబటి విశ్వనాథ్‌ను గురువారం అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. కోర్టులో హాజరుపర్చగా, న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించారని పేర్కొన్నారు.

ఈ స్థలాలు మాకొద్దు!

శ్మశాన వాటిక, కాలువ పక్కన స్థలాలిచ్చిన గత వైసీపీ ప్రభుత్వం

- అక్కడ ఇళ్లు నిర్మించలేం..కూటమి ప్రభుత్వం వేరేచోట స్థలాలు మంజూరు చేయాలి
- చినముత్తేవివాసుల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి): గత వైసీపీ ప్రభుత్వం మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో నివేశనా స్థలాలు లేని 80 మందిని గుర్తించి శ్మశాన వాటిక, పంట కాలువల పక్కన లోతైన ప్రదేశంలో సెంటున్నర చొప్పున స్థలాలు పంపిణీ చేసింది. అయితే ఆ స్థలాలు గృహాలు నిర్మించుకునేందుకు అనుకూలంగా లేదని, వేరే ప్రాంతంలో స్థలాలు మంజూరు చేయాలని అప్పటి ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తోపాటు, ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులు అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేశారు. అక్కడ పొలం కొంటున్నాం..ఇక్కడ పొలం కొంటున్నామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు కాలయాపన చేశారు. చివరకు నివేశనా స్థలాల సమస్య పరిష్కారం కాలేదు. ఒక్కో ఇంట్లో రెండు, మూడు కుటుంబాల వారు కాపురాలు ఉంటూ ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా నివేశనా స్థలాల మంజూరుపై దృష్టిసారించాలని, అర్హులను గుర్తించి మూడు సెంట్ల చొప్పున స్థలాలు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్ల పక్కన గుడిసెల్లో ఉంటున్నాం



నివేశనా స్థలాలు లేక రోడ్ల పక్కన గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాం. ఎక్కువ మంది కుటుంబసభ్యులు ఉండటం వల్ల ఇబ్బంది పడుతున్నాం. రెండు పర్యాయాల నుంచి లబ్ధిదారులను గుర్తిస్తూ అనువుగాని స్థలాలు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఈ ప్రభుత్వమైనా స్థలాలు మంజూరు చేయాలి. ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

- శేషు కుమారి, గ్రామస్థురాలు



చినముత్తేవిలో గత వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన నివాసయోగ్యం కాని స్థలాలు

చాలా ఇబ్బంది పడుతున్నాం



సొంత స్థలాలు లేవు, గృహాలు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేదు. కూటమి ప్రభుత్వం పేదవారి పట్ల కనికరం చూపి ఆదుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వం శ్మశానవాటిక పక్కన స్థలాలు ఇచ్చింది. గృహాలు నిర్మించుకునేందుకు వీలు లేకపోవడంతో ఒక్కరూ కూడా ఆ స్థలంలోకి వెళ్లలేదు. గ్రామంలో 100 నుంచి 200 మంది స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం అర్హులను గుర్తించి స్థలాలు మంజూరు చేయాలి. గృహాలు నిర్మించాలి.

- నాగలక్ష్మి, గ్రామస్థురాలు

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలెన్నో



మాట్లాడుతున్న ఏడీఏ రమాదేవి

గుడివాడ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలెన్నో ఉన్నాయని, మండలంలో ప్రకృతి వ్యవసాయం అధికంగా సాగయ్యేలా అధికారులు పనిచేయాలని ఏడీఏ ఎస్.రమాదేవి సూచించారు. గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన అగ్రికల్చర్, హార్టికల్చర్, వెలుగు అధికారుల మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. చౌటపల్లి, సిద్ధాంతం, పర్నాస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ఇంకా పెంచాలన్నారు. ప్రతీ రైతుకు అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే వర్షాకాలానికి పెరటి తోటలకు విత్తనాలను అందించాలని హార్టికల్చర్ అధికారులను కోరారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని పెంచి సేంద్రియ వ్యవసాయం నిర్వహించి రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఆమె కోరారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఏవో బి.అనంతలక్ష్మి, మండల విస్తరణాధికారి వి.అనిత, డి.ప్రదీప్, సాయి, నేహ, గంగరాజు, ఎంటీసీ లక్ష్మి, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెలుగు శాఖల అధికారులు పాల్గొన్నారు.



పామర్రు హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరారాణి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పామర్రు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు ఆలపాటి ఇందిరా రాణి పదవీ విరమణ సభకు ఆయన ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. పామర్రు పాఠశాలకు ఇందిరరాణి అందించిన సేవలను కొనియాడారు. ఇందిరారాణి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గుమ్మడి పద్మవాణి, హైస్కూల్ అభివృద్ధి కమిటీ కార్యదర్శి వల్లూరిపల్లి చక్రవర్తి, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

శేరికల్వపూడి ఉప సర్పంచ్‌గా
గోగులమూడి వెంకటేశ్వరమ్మ



వెంకటేశ్వరమ్మకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీడీవో విజయసారథి

గుడ్లవల్లేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శేరికల్వపూడి గ్రామ ఉపసర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు గోగులమూడి వెంకటేశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఎన్నిక నిర్వహించామని, వెంకటేశ్వరమ్మను రెండో వార్డు సభ్యుడు కాటూరి చలపతి రావు ప్రతిపాదించారని, మిగిలిన ఆరుగురు సభ్యులూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి, ఎంపీడీవో టి.విజయసారథి తెలిపారు. ఈ పంచాయతీలో సర్పంచ్ వైసీపీ మద్దతుదారు, వార్డు సభ్యుల్లో నలుగురు వైసీపీ, నలుగురు టీడీపీ మద్దతుదారులు న్నారు. ఉపసర్పంచ్‌ను వంతులుగా ఇద్దరికి ఇచ్చేందుకు లోపాయి కారీ ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటివరకూ పనిచేసిన ఉపసర్పంచ్ రాజీనామా చేయగా ఎన్నిక నిర్వహించారు. వైసీపీ మద్దతుదారులు కూడా వెంకటేశ్వరమ్మకే మద్దతు పలికారు.

తాడంకి ఉపసర్పంచ్‌గా కొల్లి లక్ష్మి



కొల్లి లక్ష్మికి నియామక పత్రం అందజేస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

పమిడిముక్కల: మండలంలో 4 గ్రామాలకు గురువారం నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో నలుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఫతేలంకలో ఎస్కే లాల్ అహ్మద్, అమీనాపురంలో నందేటి దుర్గాప్రవీణ్‌కుమార్, తాడంకిలో కొల్లి లక్ష్మి, మంటాడలో కలాపురెడ్డి రమాదేవి ఎన్నికయ్యారని తెలిపారు.

యాకమూరు ఉప సర్పంచ్‌గా సాంబమూర్తి



సాంబమూర్తికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న సూపరింటెండెంట్ ఉదయభాస్కర్

తోట్లవల్లూరు: యాకమూరు ఉప సర్పంచ్‌గా 10వ వార్డు సభ్యుడు బూరి సాంబమూర్తి, పెనమకూరు ఉప సర్పంచ్‌గా 10వ వార్డు సభ్యురాలు పెరుబోయిన జేజమ్మ ఎన్నికయ్యారు. యాకమూరులో వైసీపీకి చెందిన సాంబమూర్తి ఏకగ్రీవం కాగా పెనమకూరులో వైసీపీ, టీడీపీలకు చెరో ఐదుగురు వార్డు సభ్యుల చొప్పున ఉన్నారు. వైసీపీ సర్పంచ్ నందేటి గంగాభవాని ఓటుతో వైసీపీ అభ్యర్థి జేజమ్మ ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. యాకమూరులో మండల పరిషత్ సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, పెనమకూరులో ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ ఎన్నికలను నిర్వహించారు.

మద్యం వాపారుల సిండికేటు

- స్థానిక నాయకుల బెదిరింపులు
- గీత కులస్థులకు మద్యం దుకాణాల ఏర్పాటులో ఇబ్బందులు


(ఆంధ్రజ్యోతి-పమిడిముక్కల) : బీసీ వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకోవడంలో కొందరు పెత్తందారులు, మద్యం వ్యాపారుల సిండికేటు కారణంగా గీత కులస్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆది నుంచి టీడీపీకి అండదండగా ఉన్న బీసీ వర్గాల అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధికి దోహదపడాలన్న లక్ష్యంతో గీత కులాలకు కూటమి ప్రభుత్వం కృష్ణాజిల్లాలో 12 దుకాణాలు కేటాయించింది. లాటరీలో 50 శాతం రాయితీతో దుకాణాలు పొందిన గీత కులస్థులు కేటాయించిన మండలానికి వెళ్లేసరికి స్థానిక నాయకులు, మద్యం సిండికేట్ల ఆధిపత్యంతో ఇబ్బంది పడుతున్నారు. తాము చెప్పినట్లు వినాలని లేకుంటే వ్యాపారం ఎట్లా చేస్తారో చూస్తామని దుకాణాలు పొందిన వారిని స్థానిక అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని, మాట వినకుంటే వైసీపీ నాయకులతో జతకట్టి పిటిషన్లు పెట్టిస్తున్నారని దుకాణాలు పొందిన వారు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మద్యం దుకాణాలు దక్కినప్పటికీ వాటిని నడుపుకోవడం కత్తిమీద సాములా ఉందని గీత కులస్థులు అంటున్నారు. ఎక్సైజ్ మంత్రి సొంత జిల్లాలోనే అడ్డంకులు సృష్టిస్తుండడంతో అమ్మకాలు ప్రారంభం కాలేదు. పామర్రు నియోజకవర్గంలో పెదపారుపూడి, పమిడిముక్కల మండలాల్లో రెండు దుకాణాలను ప్రభుత్వం కేటాయించింది. కానీ దుకాణాలను ఏర్పాటుచేయకుండా నాయకులు స్థానికులతో కలిసి అడ్డుపడుతుండడం, అధికారులు వారికి వత్తాసు పలకడం వెనుక ఆంతర్యం ఏంటని బీసీవర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

ఆలయాల అభివృద్ధికి విరాళాల వెల్లువ



ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న నాగేశ్వరరావు, సుభాష్‌చంద్రబోస్ తదితరులు

గుడ్లవల్లేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపుర జీర్ణోద్ధరణ, ఆలయ ఆధునీకరణ, వందేళ్లకుపైగా చరిత్రగల గంగానమ్మ ఆలయ జీర్ణోద్ధరణ, పునఃనిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన పలువురు ఆలయాల అభివృద్ధికి విరాళాలు వెల్లువలా ఇస్తున్నారు. గురువారం గ్రామంలోని చెరువు వెనుక, గంగానమ్మ ఆలయం వెనుక బజార్ల నివాసులు రూ.5,00,460, యెనిగళ్ల రామకోటేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారులు యెనిగళ్ల నాగేశ్వరరావు, శివకుమార్ రూ.1,01,116, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, సీతారత్నం జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు, కుమారుడు నాగేశ్వరరావు రూ.50,697, గవిర్నేని సత్యనారాయణ రూ.50 వేలు, గ్రామానికి చెందిన ప్రముఖుడు గుత్తికొండ సుభాష్ చంద్రబోస్, ఆయన కుమారుడు గుత్తికొండ శ్రీనివాస్(యుఎస్‌ఏ) రూ.2 లక్షలను ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. వల్లభనేని వెంకట్రావు, వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, కొనరాజు బాపయ్య చౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ సభ్యులు

కామర్స్ ఫెస్ట్‌లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో నిర్వహించిన 2కే 25 కామర్స్ ఫెస్ట్‌లో అక్కినేని నాగేశ్వరరావు కళాశాల బీకాం, బీకాం కంప్యూటర్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్కే ప్రసాద్, కేఎస్ అప్పారావు పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను వారు అభినందించారు. బీకాం తృతీయ సంవత్సర విద్యార్థులు పి.మణికంఠ, ఎస్.భవాని, కె.చందు బిజినెస్ క్విజ్ పోటీల్లో ప్రథమ సాధించారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, పాలకవర్గ కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, బీకాం విభాగాధిపతి ఎ.గ్రీష్మ, ఎం.కల్యాణి, ఎస్.కవిత, వెన్నెల సంధ్య, బి.ప్రసన్న పాల్గొన్నారు.

యువతి అనుమానాస్పద మృతి

గుడివాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కాలనీకి చెందిన గడె సరస్వతి(20) ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలి

నందివాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని ఎస్సై శ్రీనివాస్ సూచించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపైన, సత్ప్రవర్తనపైన గురువారం ఎస్సై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి రవాణా చేసే వారిని, మత్తు పదార్థాలు తాగే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. గంజాయి విక్రయదారుల వివరాలు తెలిపిన వారికి తగిన బహుమతులు ఇస్తామని తెలిపారు. హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పామర్రు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టీఎస్ఆర్ అండ్ టీబీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి ఏడాది సెకండ్ సెమిస్టర్ విద్యార్థులు 40 మందికి తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ స్టడీ మెటీరియల్ వితరణగా ఇచ్చారు. గురువారం ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. డి.రవి, పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

గుడివాడ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్టు రూరల్ ఎస్సై చంటిబాబు తెలిపారు. గురువారం టిడ్కో ఇళ్ల వద్ద డ్రోన్ల ద్వారా నిఘా పెట్టి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారిని స్టేషన్‌కు తరలించామన్నారు. ప్రతి గ్రామంలో తమ సిబ్బంది ఉంటున్నారని, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులను వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

వృద్ధులకు అన్నదానం

గుడివాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో గురువారం కరుణాపీఠంలో సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ మాతృమూర్తి శశిరేఖ 12వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు భోజనాలు పెట్టారు. సంఘ సభ్యులు తిరుపతయ్య, జాజుల తాతారావు, నర్ని వెంకట రామారావు, కంతేటి హరిబాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గుడివాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న లారీ యజమాని రసూల్‌ఖాన్ కుటుంబానికి రూ.35వేలు అందజేసినట్లు గుడివాడ లారీ ఓనర్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం 11వ వార్డులోని రసూల్‌ఖాన్ ఇంటికి వెళ్లి ఖాన్ కుటుంబసభ్యులకు అసోసియేషన్ సభ్యులు నగదు అందించారు. అసోసియేషన్ కార్యదర్శి గోళ్ల శివ, సభ్యులు ఆవుల రఘు, అడ్డాల నాని, మైనేని ఆనంద్, మణికంఠ, టీడీపీ నాయకులు సయ్యద్ జబీన్, బిస్మిల్లా, రబ్బానీ పాల్గొన్నారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440





ఈవీఎం గిడ్డంగి కలెక్టర్ పరిశీలన

మచిలీపట్నం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని ఈవీఎం గిడ్డంగిని కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ గురువారం పరిశీలించారు. పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీఆర్వో కె. చంద్రశేఖర్, ఎన్నికల విభాగం సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

ఏకగ్రీవ ఉప సర్పంచ్‌లకు ధ్రువీకరణ పత్రాలు



శీలం శ్రీనివాసరావును సత్కరిస్తున్న ముప్పనేని, తాడికొండ చిన్నా

శ్రీకాకుళం ఉపసర్పంచ్‌గా శీలం శ్రీనివాసరావు

ఘంటసాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం గ్రామ ఉపసర్పంచ్‌గా టీడీపీ నేత శీలం శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం 12 మందికి 10 మంది ఎన్నికకు హాజరు కాగా, ఏడో వార్డు మెంబర్ శీలం శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వరరావు ఉపసర్పంచ్‌గా శీలం శ్రీనివాసరావు పేరును ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) పూలమాలు, దుశ్శాలువాతో శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి అభినందించారు. ఎస్సై కె.ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



వెంకట రమణకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి కెటి.సుందరి

నాగాయితిప్ప ఉపసర్పంచ్‌గా వెంకట రమణ

మోపిదేవి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాగాయితిప్ప ఉపసర్పంచ్‌గా వైసీపీ సానుభూతిపరురాలు పెనుమత్స వెంకట రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీలో 10 మంది వార్డుసభ్యులు ఉండగా, ఏడుగురు సభ్యులు సమావేశానికి హాజరై పెనుమత్స వెంకట రమణ పేరు ప్రతిపాదించడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈవోపీఆర్డీ కె.త్రిపుర సుందరి ఎన్నికల అధికారిగా వ్యవహరించి, ధ్రువీకరణ పత్రాన్ని సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావుతో కలిసి అందజేశారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ బందోబస్తు పర్యవేక్షించారు.



బాకీ హరీష్‌ను అభినందిస్తున్న పోతన స్వామి తదితరులు

ఆకులమన్నాడు ఉపసర్పంచ్‌గా బాకీ హరీష్

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆకులమన్నాడు గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక ఎన్నికల అధికారి బి.రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన పార్టీకి చెందిన బాకీ హరీష్ (నాని) ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హరీష్‌ను మండల టీడీపీ అధ్యక్షుడు, డీసీ ఛైర్మన్ పోతన స్వామి, ఆకులమన్నాడు సర్పంచ్ మొహమ్మద్ రఫీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎజ్జు శివాజీ, ఎలకుర్రు నీటి సంఘం అధ్యక్షుడు సూరారపు ఆంజనేయులు, మొహమ్మద్ సలీం, పార్టీ నాయకులు, వార్డు సభ్యులు అభినందించారు.



పంచాయతీ కార్యదర్శికి అవిశ్వాస తీర్మానం నోటీసు అందిస్తున్న పంచాయతీ సభ్యులు

అవనిగడ్డ ఉపసర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు

అవనిగడ్డ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ పంచాయతీ ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణపై పంచాయతీ పాలకవర్గ సభ్యులు గురువారం అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ గాజుల జైగోపాల్ నేతృత్వంలో ఎంపీడీవో ఎం.మరియదేవి, గ్రామ కార్యదర్శి బి.అనితలను వేర్వేరుగా కలిసి అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. ఉపసర్పంచ్ సత్యనారాయణ తన వ్యాపార కార్యకలాపాలతో ఉపసర్పంచ్ విధులకు న్యాయం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యవర్గాన్ని అత్యవసరంగా సమావేశపరిచి అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరారు.

శానిటరీ సిబ్బందికి గ్లౌజ్‌ల పంపిణీ

మచిలీపట్నం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున పబ్లిక్ స్కూల్ అధినేత వి.సుందరరాం 45వ డివిజన్ పారిశుధ్య సిబ్బందికి గ్లౌజ్‌లు, టోపీలు పంపిణీ చేశారు. పి.వి.ఫణికుమార్, షేక్ అల్లాభక్షు, మానస, రామశేఖర్ పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లి తాగునీటి సమస్య అధికారులకు పట్టదా!

● మోపిదేవి మండల సమావేశంలో సర్పంచ్, వైస్ ఎంపీపీ, సభ్యుల ఆగ్రహం



తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ప్రశ్నిస్తున్న సర్పంచ్ అరజా సంధ్యారాణి



అవనిగడ్డ మండల సమావేశాన్ని సభ్యులు బాయ్‌కాట్ చేయటంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

మోపిదేవి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లి తాగునీటి సమస్యపై వారం రోజులుగా పత్రికల్లో కథనాలు వస్తున్నా కనీసం ఒక్క అధికారి కూడా గ్రామాన్ని సందర్శించి సమస్యకు పరిష్కారం చూపే ప్రయత్నం చేయలేదని సర్పంచ్ అరజా సంధ్యారాణి, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆశాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోపిదేవి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎంపీపీ రావి దుర్గావాణి ఆయా శాఖల వారీగా సమీక్షించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆ శాఖ పనితీరు ను వివరించారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ జోక్యం చేసుకుని పెదకళ్లేపల్లిలో రక్షిత మంచినీటికి ఫిల్టర్ బెడ్లు పని చేయక, మురుగునీరు వస్తోందన్నారు. ప్రతి సమావేశంలో సమస్య ప్రస్తావిస్తుండగా, ఇప్పటి వరకు కనీసం ఒక్క అధికారి గ్రామాన్ని సందర్శించ లేదన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ సంబంధిత శాఖాధికారులు పట్టించుకోరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలని నాలుగేళ్లుగా అర్జీలు సమర్పించి అంచనాలు అందజేయటం జరిగిందన్నారు. సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారో తెలపాలన్నారు. మంచినీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరు కావాల్సి ఉన్నందున ఆలస్యం అవుతుందన్నారు. పెదకళ్లేపల్లి, కె.కొత్తపాలెం, పెదప్రోలు గ్రామాల్లో సచివాలయ సర్వేయర్లు అందుబాటులో ఉండటం లేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు. వేసవికాలం కావటంతో భూముల సర్వే చేయాల్సి ఉందని, ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చినా సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. మండల స్థాయి అధికారులు సర్వసభ్య సమావేశాలకు రాకపోవటం ఏమిటని సభ్యులు నిలదీశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కుప్పలు ఉన్నాయని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరో పది రోజులు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, పెదప్రోలు సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు అవకాశం కల్పించాలని జాయింట్ కలెక్టర్‌కు లేఖ ద్వారా తెలియజేయటం జరిగిందని ఏవో హెబ్సిబా రాణి తెలిపారు. మండలంలో 800లకుపైగా మహిళా సంఘాలు ఉండగా, మండల స్థాయి వెలుగు కార్యాలయంలో బాధ్యత గల ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము పవన్ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు తెలిపారు. ఏపీఎం, సీసీలు ఎప్పుడు వెళ్లినా కార్యాలయంలో ఉండటం లేదని, మహిళలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ నడకుదుటి జనని కుమారి, కడవకొల్లు సీతారామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సభ్యుల బాయ్‌కాట్.. అవనిగడ్డ మండల సమావేశం వాయిదా

అవనిగడ్డ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల వివరాలు ఏవీ తమకు తెలియడం లేదంటూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. వివిధ కార్పొరేషన్ల కింద మండలానికి 104 రుణాలు మంజూరు కాగా, పాలకవర్గ సభ్యులకు తెలియజేయకుండా దరఖాస్తులు స్వీకరించారని పేర్కొన్నారు. మధ్యవర్తులు రంగ ప్రవేశం చేసి అక్రమ వసూళ్లు చేస్తున్నారన్నారు. పాలకవర్గానికి చెప్పకుండా ఎలా దరఖాస్తులు స్వీకరిస్తారని సభ్యులు ప్రశ్నించి సమావేశం నుంచి వెళ్లిపోవటంతో కోరం లేక గురువారం జరగాల్సిన సమావేశం వాయిదా పడింది.

మాజీ కౌన్సిలర్ లీలావతి మృతి



తలారి లీలావతి (ఫైల్)

మచిలీపట్నం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం 24వ డివిజన్ టీడీపీ మాజీ కౌన్సిలర్ తలారి లీలావతి (60) అకస్మాత్తుగా మృతి చెందారు. లీలావతి భౌతికకాయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, మాజీ కౌన్సిలర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుడు గోకుల శివ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. లీలావతి భర్త తలారి రాంబాబును పలువురు ప్రముఖులు పరామర్శించారు. తలారి లీలావతికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జిల్లా న్యాయాధికారి అవనిగడ్డ సబ్‌జైలు తనిఖీ



అవనిగడ్డ సబ్ జైలును తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయాధికారి అరుణ సారిక

అవనిగడ్డ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ సబ్ జైలును జిల్లా న్యాయాధికారి అరుణ సారిక గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొవ్వ న్యాయాధికారి రాజన్ ఉదయ్ ప్రకాష్, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి కె.రామకృష్ణయ్యతో కలిసి అరుణ సారిక సబ్ జైలును సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ఇతర వసతులపై ఆరా తీశారు. సకాలంలో న్యాయసహాయం అందుతున్నదీ, లేనిదీ ఆమె అడిగి తెలుసుకున్నారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామోత్సవానికి బయలుదేరిన గంగానమ్మ



డీఎస్పీ విద్యశ్రీకి వస్త్రాలు బహూకరిస్తున్న ధర్మకర్త

వైభవంగా గంగానమ్మ గ్రామోత్సవం ప్రారంభం

కోడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో 50వ వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా గంగానమ్మ గ్రామోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమయింది. పుట్టింటివారైన కంచర్ల వంశీకులు ఊరేగింపుగా తరలివచ్చి పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు సమర్పించారు. అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ, సీఐ యువకుమార్, కోడూరు ఎస్సై చాణిక్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభించారు. అమ్మవారు కోడూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మొదటి పూజలందుకుని గ్రామంలోకి బయదులేరి వెళ్లారు. అవనిగడ్డ డివిజన్ పోలీసు సిబ్బంది, వివిధ పార్టీలకు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీకి, సీఐ యువకుమార్, ఎస్ఐ చాణిక్య దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు పోలీసు అధికారులకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఉల్లి శేషగిరిరావు, పిల్లి మల్లిఖార్జునరావు, పూతబోయిన లక్ష్మణరావు, పరిశె మాధవరావు, పలువురు గ్రామ ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై దర్యాప్తు చేయాలి

మోపిదేవి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : దైవసేవకులు పగడాల ప్రవీణ్ మృతికి కారణాలు తెలియజేయాలంటూ హెర్మోను పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం మోపిదేవిలో దైవసేవకులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఎస్సై వై.సత్యనారాయణకు వినతిపత్రాలు అందజేశారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి విషయమై ఒక్కొక్కరు ఒక్కో రకంగా మాట్లాడుతున్నారని, ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలు తెలియజేయాలన్నారు. హెర్మోను పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు గుర్రం ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి పి.సతీష్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ

మోపిదేవి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనూ క్రీడల్లోనూ రాణించాలని మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు అన్నారు. మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలోని 25 మంది క్రీడాకారులకు ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు వితరణతో క్రీడా దుస్తులను సమకూర్చి గురువారం అందజేశారు.

సబ్ జోన్ ఆటల పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు సభ్యులు రావి రత్నగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఘనంగా సంపటాలమ్మ గ్రామసంచారం

చల్లపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామదేవత సంపటాలమ్మ గ్రామసంచారం గురువారం చల్లపల్లిలో ఘనంగా జరుగుతోంది. ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు, కుమారులు నరేష్, పూర్ణ అమ్మవారి ఘటం బిందెను శిరస్సున మోస్తూ గ్రామసంచారం చేస్తుండగా, ఇంటి ముంగిటకు వస్తున్న అమ్మవారికి భక్తులు వారపోసి పసుపు కుంకుమ సమర్పించారు. అమ్మవారికి కోటేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గురువారం మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటం బిందెను బయటకు తీసుకువచ్చారు.

లారీ బోల్తా, స్వల్పగాయాలు

కృత్తివెన్ను, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ నుంచి పాలకొల్లుకు కోత మిషన్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు గాంధీనగరం గ్రామంలో 216 జాతీయ రహదారిపై అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. లారీ డ్రైవర్, కోత మిషన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ప్రభుత్వం మారినా బోర్డు మారలేదు



జగన్ ఫొటో ఉన్న డయాలసిస్ సెంటర్ బోర్డు

ఆంధ్రజ్యోతి-అవనిగడ్డ : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం కొలువు తీరి తొమ్మిది నెలలు కావొస్తున్నా అవనిగడ్డలో అధికారులు బోర్డులు మార్చే విషయంలో విషయంలో ఇంకా కళ్లు తెరవటం లేదు. అవనిగడ్డ ఏరియా ఆసుపత్రి వద్ద రాష్ట్ర ప్రభుత్వం అపోలో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, బోర్డును ఏరియా ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ లోగోను చిన్నగా ముద్రించి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోను పెద్దగా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ అధికారులు మాత్రం ఏరియా ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద బోర్డును యథావిధిగా కొనసాగిస్తుండటంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పలు పర్యాయాలు ఆసుపత్రిని సందర్శించినప్పటికీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీని నియమించినప్పటికీ వారెవ్వరు ఈ బోర్డు గురించి ప్రస్తావించకపోవటంతో ఆసుపత్రి ఈ బోర్డును కొనసాగిస్తోంది. ప్రభుత్వం మారి 9 నెలలు కావొస్తున్నా ఆనాటి వైసీపీ వాసనలు కొనసాగటం పట్ల ప్రతి నిత్యం ఆసుపత్రికి వందలాదిగా వచ్చే రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





లారీ ఢీకొని బోల్తా కొట్టిన ఆటో, గాయపడిన మహిళ

ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన లారీ

● ఐదుగురికి గాయాలు

మోపిదేవి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగి ఉన్న ఆటోను వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టి డ్రైవర్‌తో సహా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెదప్రోలు పంచాయతీ శివారు ప్రశాంతి నగర్ వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఈ సంఘటన జరిగింది. చల్లపల్లి వైపు నుంచి ఆటో వస్తుండగా, కాసానగర్, కప్తానుపాలెం మహిళలు బాణావత్ బేబీ, మూడే చిట్టెమ్మ పెదప్రోలులో కూలీ పనుల నిమిత్తం ఆటో ఎక్కారు. మార్గమధ్యలో మరో మహిళను ఎక్కించుకునేందుకు ఆటో ఆగింది. అదేసమయంలో చల్లపల్లి వైపు నుంచి వస్తున్న లారీ ఆగి ఉన్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఆటో పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న పొలంలో పడింది. డ్రైవర్ సర్వేశ్వరరావు, ఆటోలో ప్రయాణిస్తున్న బాణావత్ బేబీ, మూడే చిట్టెమ్మ, గంటా వెంకటలక్ష్మి, సోమిశెట్టి లక్ష్మిలకు గాయాలయ్యాయి. గ్రామస్థుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో వీరికి ప్రథమ చికిత్స చేసి అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాణావత్ బేబీ ఫిర్యాదు మేరకు ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ సహకారంతో మహాప్రస్థానం రథం ఏర్పాటు

అవనిగడ్డ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాలుగు కిలో మీటర్లకు పైగా మృతదేహాన్ని మోయాల్సి రావటంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ సంస్థ మహాప్రస్థానం వాహనాన్ని సిద్ధం చేసింది. అపర కర్మలు నిర్వహించుకునే విధంగా కొత్తపేట రోడ్డులో షెడ్డును ఆధునీకరించగా, ఇప్పుడు మహాప్రస్థాన వాహనం కూడా సిద్ధం చేయటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ కార్యదర్శి దివి లీలా కృష్ణ, సహ కార్యదర్శి అలపర్తి గోపాలకృష్ణ, సభ్యులు కమ్మిలి ప్రసాద్, బండే శ్రీనివాసరావు, అన్నపరెడ్డి కృష్ణ, యాసం శోభన్‌బాబు, చింతలపూడి శేఖర్, అద్దెపల్లి నాగేశ్వరరావు గురువారం మహా ప్రస్థాన రథాన్ని చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ కార్యాలయం వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచారు. వాహనం కావాల్సిన తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.92 లక్షలు

మచిలీపట్నం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాబర్డ్‌సన్ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీల కానుకలను గురువారం లెక్కించగా రూ.2,92,811 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి బీఎస్‌రెడ్డి తెలిపారు. డివిజన్ దేవదాయ శాఖ ఉపతనిఖీ అధికారి కె శ్రీనివాసరావు పర్యవేక్షించారు. రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఏడు హుండీల లెక్కింపు జరిగింది. గరుడ సేవా సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షా కేంద్రం వీసీ రాంజీ తనిఖీ

మచిలీపట్నం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజాతీయ కళాశాల బీఈడీ పరీక్ష కేంద్రాన్ని కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతి కె. రాంజీ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 1800 మంది విద్యార్థుల ఈ పరీక్షలకు హాజరవుతున్నారు.